# కేసీఆర్‌కు కృతజ్ఞతలు

- నిర్మల్ జిల్లా కలను సాకారం చేసిన మహనీయుడు
- ప్రత్యేక తెలంగాణతోనే జిల్లా అభివృద్ధి చెందింది
- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్, అక్టోబర్ 4(నమస్తే తెలంగాణ) : 'నిర్మల్ జిల్లా కలను సాకారం చేసిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు. కేసీఆర్ పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడడంతో నిర్మల్ జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నది.' అని అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరిగిన భారీ బహిరంగ సభలో మంత్రి అల్లోల మాట్లాడారు. నిర్మల్ జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటు కావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు. కొత్తగా నర్సాపూర్(జీ), నిర్మల్ రూరల్, సోన్ మండలాలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఇటీవలే పొనకల్ మండలాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారని, పొనకల్ మండల ప్రజల తరఫున సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. మంత్రి కేటీఆర్ సాకారంతో నిర్మల్ నియోజకవర్గంలో రూ.1,157 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించుకోవడం, శంకుస్థాపనలు చేసుకోవడం జరిగిందన్నారు. శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఎత్తిపోథల పథకాన్ని ప్రారంభించుకోవడం ఈ ప్రాంత రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ ఎత్తిపోతల పథకం పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.714 కోట్లను ఖర్చు చేసిందన్నారు. పాత పోచంపహాడ్ శివారులో 40 ఎకరాల విస్తీర్ణంలో రూ. 250 కోట్లతో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి ఈ రోజు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందన్నారు. ఇటీవలే మెడికల్ కళాశాలను ప్రారంభించుకున్నామని, తరగతులు కూడా ప్రారంభమయ్యాయన్నారు. మెడికల్ కళాశాలతో నిర్మల్‌లో 350 పడకలు అందుబాటులోకి వచ్చాయని, దీనితో ఈ ప్రాంతం ఒక మెడికల్ హబ్‌గా మారనుందన్నారు. ఇలా అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నదని, సీఎం కేసీఆర్‌తోనే ప్రగతి సాధ్యమైందన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, వేదికపై మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

### బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం..

దిలావర్‌పూర్/సారంగాపూర్/లక్ష్మణచాంద, అక్టోబర్ 4 : బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ నాయకత్వాన్నే ప్రజలు కోరుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా దిలవార్‌పూర్ మండలంలోని గుండంపల్లి గ్రామంలో ప్యాకేజీ-27 ఎత్తిపోతల పథకాన్ని మంత్రి కేటీఆర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పటు చేసిన సమావేశంలో అల్లోల మాట్లాడారు. తాను 25 ఏండ్ల నుంచి రాజకీయంగా సేవలందిస్తున్నాని, ఈ తొమ్మిదేండ్లలో జరిగిన అభివృద్ధి ఎప్పుడూ కాలేదన్నారు. ప్యాకేజీ-27లో భాగంగా మూడు కెనాల్స్(స్వర్ణ, కుంటాల, మరో కెనాల్) ద్వారా దిలావర్‌పూర్ మండల రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. మాటేగాం గుట్ట మీద ఉన్న 1500 ఎకరాల భూములకు సాగునీరు అందుతుందన్నారు. ఒకప్పుడు గుట్టమీది భూములకు రూ. 5 వేల నుంచి రూ.10 వేల ధర ఉండేదని.. ప్రస్తుతం ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయడం ద్వారా రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెరిగిందన్నారు. ఎత్తిపోతల పథకం కింద ఉన్న గ్రామాల చెరువులకు కూడా నీరు వెళ్తుందన్నారు.

### బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి..

సోన్, అక్టోబర్ 4 : సమైక్యాంధ్రలో 60 ఏళ్లలో జరగని అభివృద్ధిని బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తొమ్మిదేళ్లలో చేసి చూపించిందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. సోన్ మండలం పోచంపాడ్‌లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ రావడం ఈ ప్రాంత రైతులకు మేలు జరుగుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలో పది వేల ఎకరాల వరకు ఆయిల్ పామ్ సాగవుతోందన్నారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని తమ ప్రాంతంలో ప్రారంభించాలని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు విన్నవించిన వెంటనే రూ.300 కోట్లతో ఫ్యాక్టరీని ఇక్కడ నెలకొల్పడం మన అదృష్టమన్నారు. 40 ఎకరాల్లో ఏడాదిన్నరలో ఫ్యాక్టరీని పూర్తి చేసి 1000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. మంత్రి కేటీఆర్ ఒకేరోజు నిర్మల్ జిల్లాలో రూ. 1100 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించడం ఎంతో హర్షణీయమని తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-310380-AII

NAME CHANGED

★I, MUTHEM PRABHAKAR (Old name), R/o.Q.No. ND 2639, Nagarjuna Colony, Naspur, Mancherial Dist., T.S., have changed my Surname as MUTHYAM PRABHAKAR (New Name) S/o. PANCHAKSHARAIAH.
NTK-316032

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం

200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి

50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677

# గులాబీ మయంగా నిర్మల్

- కేటీఆర్ పర్యటన సక్సెస్
- సభను విజయంతం చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు : మంత్రి అల్లోల

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 4 : నిర్మల్ నియోజకవర్గంలో రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో పట్టణంతో పాటు, నియోజకవర్గం గులాబీ మయంగా మారింది. మంత్రి కేటీఆర్ హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా దిలావర్‌పూర్‌కు చేరుకున్నారు. గుండంపల్లిలో లక్ష్మీ నరసింహ ఎత్తిపోతల పథకం పంప్ హౌస్‌ను ప్రారంభించారు. దిలావర్‌పూర్ శివారులోని డెలివరీ సిస్టర్న్‌ను ప్రారంభించి, గోదావరికి పూజలు చేశారు. పాత పోచంపాడ్ వద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారు. ఈ ప్రదేశాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, కేటీఆర్‌ను చేసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నిర్మల్ పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ సందడి చేశారు. ఆయనతో సెల్ఫీలు దిగేందుకు యువతీయువకులు ఆసక్తి చూపారు. సభలో కేటీఆర్ ఇచ్చిన ప్రసంగం బీఆర్ఎస్ శ్రేణుల్లో నయా జోష్ నింపింది. కేటీఆర్ పర్యటనలో బీఆర్ఎస్ కార్యకర్తలు, క్రియాశీలక సభ్యులు, నాయకులు, కార్యకర్తలు ఉదయం నుంచి ఉత్సాహంగా పాల్గొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పర్యటన, సభను విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సమష్టి కృషితో సభ సక్సెస్ అయిందని, అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ఇదే జోష్‌తో సన్నద్ధమవ్వాలని పార్టీ శ్రేణులు, నాయకులకు పిలుపునిచ్చారు.

# రూ.152.65 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

నిర్మల్ అర్బన్,/ నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 4 : నిర్మల్ పట్టణంలో రాష్ట్ర మంత్రి కల్వకుంట్ల తారక రామారావు బుధవారం రూ.152.65 కోట్లతో పలు అభివృద్ధి పనులకు మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డితో కలిసి శంకుస్థాపనలు చేశారు. ముందుగా మంత్రి కేటీఆర్‌కు మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, అధికారులు పూల మొక్కలు అందించి, ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని పాత తహసీల్ కార్యాలయ స్థలంలో 2 ఎకరాల 30 గుంటల విస్తీర్ణంలో రూ.10.15 కోట్లతో అధునాతన హంగులతో నిర్మించనున్న సమీకృత మార్కెట్‌కు శంకుస్థాపన చేశారు. రూ.2 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో దోబీ ఘాట్ పనులకు, రూ.50 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు, మంచినీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు అమృత్ పథకంలో భాగంగా రూ.62.50 కోట్లతో చేపట్టే పనులకు, రూ.4 కోట్ల టీయూఎఫ్‌డీసీ నిధులతో మౌలిక వసతుల కల్పనకు, ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా రూ.25 కోట్లతో మౌలిక వసతుల కల్పనలో భాగంగా చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. పట్టణ ప్రజలకు తాగునీరందించే మిషన్ భగీరథ నీటి పంపును ఆన్‌చేశారు. అనంతరం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రగతి నివేదికను పరిశీలించారు. అక్కడే ఏర్పాటు చేసిన నిర్మల్ చరిత్రను ప్రొజెక్టర్‌పై తిలకించారు. అనంతరం సమీపంలోనే నూతనంగా నిర్మించిన రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనాన్ని ప్రారంభించారు. మంత్రి కేటీఆర్ వెంట జడ్పీ చైర్ పర్సన్ విజయలక్ష్మీ, మున్సిపల్ కమిషనర్ రాజు, నాయకులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు ఉన్నారు.



సమీకృత మార్కెట్ శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న మంత్రులు కల్వకుంట్ల తారకరామారావు, అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

## మంత్రి కే తారకరామారావు నిర్మల్ పర్యటన సైడ్‌లైట్స్

నిర్మల్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) :

- ఉదయం 10.41 గంటలకు దిలావర్‌పూర్ మండలం గుండంపెల్లికి హెలీక్యాప్టర్ ద్వారా చేరుకున్న మంత్రి కేటీఆర్‌కు మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ విజయలక్ష్మి రాంకిషన్ రెడ్డి, తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వేణుగోపాలాచారి, ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్, బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్, కలెక్టర్ వరుణ్ రెడ్డి ఘన స్వాగతం పలికారు.
- ఉదయం 10.59 గంటలకు గుండంపెల్లి వద్ద కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ-27 (శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఎత్తిపోతల పథకం పంపు హౌస్) పనులను మంత్రి కేటీఆర్ స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు.
- ఉదయం 11.15 గంటలకు దిలావర్‌పూర్ శివారులో గల డెలివరీ సిస్టర్న్‌ను మంత్రి కేటీఆర్ పరిశీలించారు. ఎత్తిపోథల ద్వారా తరలివచ్చిన గోదావరి జలాలకు పూజలు చేసి గంగమ్మతల్లికి చీర, సారెను సమర్పించారు.
- ఉదయం 11.20 గంటలకు అక్కడే రైతులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి 18 నిమిషాల పాటు మాట్లాడారు.
- రైతులతో నిర్వహించిన సమావేశంలో నా వయసు 47, ఇంద్రన్న వయసు నాకు ఉల్టా.. అంటే.. 74 ఏండ్లున్నా ఆయన నా కంటే చురుకుగా ఉన్నారనడంతో నవ్వులు విరబూశాయి.
- ఉదయం 11.42 గంటలకు మంత్రి కేటీఆర్ సోన్ మండలం పాత పోచంపాడ్ వద్దకు చేరుకున్నారు. 11.50 గంటలకు రూ. 250 కోట్లతో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు.
- మధ్యాహ్నం 12 గంటలకు ఆయిల్‌పామ్ మొక్క నాటారు. అనంతరం ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులతో సమావేశమయ్యారు.
- మధ్యాహ్నం 12.25 గంటలకు నిర్మల్‌కు బయలుదేరి వెళ్లారు.
- మధ్యాహ్నం 12.35 గంటలకు నిర్మల్‌లోని సమీకృత కలెక్టరేట్ ఆవరణలో గల హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు.
- మధ్యాహ్నం 12.45 గంటలకు నిర్మల్ పట్టణంలోని సమీకృత మార్కెట్ నిర్మించే స్థలానికి చేరుకొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.
- మధ్యాహ్నం 12.50 గంటలకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని పరిశీలించారు.
- మధ్యాహ్నం ఒంటిగంటకు నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల ప్రగతి నివేదిక బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు.
- మధ్యాహ్నం 1.05 గంటలకు విశ్రాంత ఉద్యోగుల నూతన హాలును ప్రారంభించారు.
- మధ్యాహ్నం 1.20 గంటలకు నిర్మల్‌లోని బహిరంగ సభా స్థలికి చేరుకున్నారు. మంత్రి కేటీఆర్ తన ప్రసంగాన్ని ప్రారంభించేందుకు సిద్ధం కాగానే.. ఒక్క సారిగా జనం సీఎం.. సీఎం.. అంటూ నినాదాలతో హోరెత్తించారు. దీంతో మంత్రి కేటీఆర్ సీఎం ఇక్కడ లేరు.. హైదరాబాద్‌లో ఉన్నారని చమత్కరించారు.
- అభివృద్ధిని చూసి కడుపు నిండా ఓట్లు వేసి బీఆర్ఎస్‌ను ఆశీర్వదించండని మంత్రి కోరడంతో జనం నుంచి విశేష స్పందన వచ్చింది.
- ఖానాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ పేరును మంత్రి కేటీఆర్ ప్రస్తావించినప్పుడు ప్రజలు కేకలు వేస్తూ చప్పట్లు కొట్టారు. జర్ర ఆగుండ్రి.., మీరంతా జాన్సన్ మనుషులని తెలుస్తుందనడంతో చప్పట్లు రెట్టింపయ్యాయి.
- ప్రతి ఊరికి నీళ్లు వస్తే గట్టిగా చప్పట్లు కొట్టమని కోరడంతో జనం నుంచి స్పందన వచ్చింది.
- కరంటు సక్రమంగా ఇస్తలేరంటూ ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపోళ్లకు ఓ 30 బస్సులు పెడుతం. ఏ ఊరికి వెళ్లి వరుసగా నిలబడి కరంటు తీగలు పట్టుకోండి రాష్ట్రానికి ధరిద్రం పోతుందనడంతో ప్రజలంతా నవ్వారు.
- ఐకే రెడ్డి చాలా మంచోడనగానే విజిల్స్ వేసి చప్పట్లు కొట్టారు.
- మధ్యాహ్నం 2.10 గంటలకు బహిరంగ సభా స్థలి నుంచి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి నివాసానికి బయలుదేరి వెళ్లారు.
- మంత్రి ఐకే రెడ్డి నివాసంలో లంచ్ చేసిన అనంతరం పార్టీ శ్రేణులు కేటీఆర్‌తో సెల్ఫీ దిగేందుకు పోటీపడ్డారు.
- మధ్యాహ్నం 2.35 గంటలకు సమీకృత కలెక్టరేట్ వద్ద గల హెలీప్యాడ్ వద్దకు చేరుకొని అక్కడి నుంచి బాన్సువాడ పర్యటనకు బయలుదేరి వెళ్లారు.